

మావోయిస్టుల అరెస్ట్

నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు ములుగు ఎస్పీ గాష్ ఆలం తెలిపారు. - 8లో▸



అన్నదాతల ఆగ్రహం

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదని సెంటర్ నిర్వాహకుల తీరుపై ఆగ్రహించిన రైతులు కాటారం–మంథని రహదారిపై ఆందోళనకు దిగారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
42°/27°

వాతావరణం

ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. వేడి గాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ జెండా గద్దెపై జాతీయ పతాకావిష్కరణ



స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ జంట పట్టణం పరిధి శివునిపల్లిలోని వివేకానంద చౌరస్తా వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బీఆర్‌ఎస్ జెండా గద్దెకు ఏర్పాటు చేసిన కర్రకు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఒక పార్టీ గద్దెకు ఏర్పాటు చేసిన కర్రకు జాతీయ జెండాను ఆవిష్కరించడం గ్రామంలో చర్చనీయాంశమైంది. ఈ విషయమై పలువురు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పార్టీ నాయకులు ఆ జెండాను తొలగించారు.

బీజేపీ కార్యాలయంలో వేడుకలు



జనగామ: బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దివంగత సుష్మాస్వరాజ్ ఫొటో వద్ద నివాళులర్పించిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

పట్టణ సుందరీకరణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



జనగామ/జనగామ రూరల్: పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తాలో వాటర్ ఫౌంటెయిన్‌తో పాటు సుందరీకరణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రజిత, జిల్లా ప్రధాన ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, కౌన్సిలర్లు తదితర నాయకుతో కలిసి ఎమ్మెల్యే ఆర్టీసీ చౌరస్తాలో పర్యటించారు. అలాగే దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చౌరస్తాలోని రుద్రమదేవి విగ్రహం చుట్టూ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే రాత్రి ప్రారంభించారు.

బుగులు వెంకన్నకు ప్రత్యేక అలంకరణ



చిల్పూరు: స్థానిక చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి గజమాలతో ప్రత్యేక అలంకరణ, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు రవీందర్ శర్మ, రంగా చార్యులు, కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

విద్యారణ్యపురి : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించిన విద్యార్థులకు ఈ నెల 5 నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) గోపాల్ శుక్రవారం తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ కళాశాలల్లో హాల్‌టికెట్లు తీసుకొని పరీక్షలకు హాజరుకావాలని డీఐఈఓ సూచించారు.

ప్రగతి పరుగులు





వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, డీసీపీ, జెడ్పీ చైర్మన్



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

- కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- వ్యవసాయ రంగానికి జీవం పోసిన సీఎం
- గోదావరి జలాలతో భూగర్భ జలాలు పెరిగాయి
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ప్రారంభం

జనగామ: మనం కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కారు చేపట్టిన ప్రగతి పరుగులు తీస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవా రం సమీకృత కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, కలెక్టర్ శివలింగయ్య, డీసీపీ పి.సీతారాం, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ముందుగా తెలగాణతల్లి విగ్రహానికి పూలమాల వేశాక, అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన తర్వాత పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రంగం నీరుగారిపోయి పంటలకు సాగునీరు ఇవ్వడానికి కరెంటు గంట కూడా ఉండేది కాదు.. ఉన్నా లోవోల్టేజీతో మోటార్లు తరుచూకాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. 'తెలంగాణ వస్తే.. విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందే.. గంట కరెంటు రాదు'.. అంటూ నాడు ఆంధ్రోళ్లు ఎగతాలి చేస్తే.. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయం, సాగునీటి రంగాలకు పెద్ద పీట వేసి జీవం పోశారని, గోదావరి జలాలతో భూగర్భ జలాలు పెంచిన మహనీయుడని కొనియాడారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్‌తో ఒక్కో 5 హెచ్‌పీ మోటారుకు ఏడాదికి కరెంటు బిల్లు రూ.1.25 లక్షల వరకు వస్తోందని, ఈ లెక్కన మెజార్టీ రైతులకు రైతు బంధు, రైతుబీమా, ఇతర సబ్సిడీ పథకాలు పోను.. కరెంటు బిల్లు ఇంత పెద్ద మొత్తంలో చెల్లించే రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటే అన్నారు. విద్యుత్ వినియోగంపై ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులపై ప్రతీ రైతుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు.



చాలెంజ్‌గా తీసుకోవాలి

దశాబ్ది ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు చాలెంజ్‌గా తీసుకుని 21 రోజుల పాటు విజయవంతం చేయాలని మంత్రి కోరారు. వైద్యం, వ్యవసాయం, పోలీసు, హార్టికల్చర్, విద్య, పారిశ్రామికం, సంక్షేమం, చెరువుల ప్రగతి, మిషన్ భగీరథ ఇలా ప్రతి కార్యక్రమాన్ని నియోజకవర్గ, మండల, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఇందులో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి ఊరిలో అభివృద్ధికి సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు ఉమ్మడి రాష్ట్రం.. స్వరాష్ట్రంలో తేడాను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

దశాబ్ది ఉత్సవాల్లో కూచి పూడి, జానపద నృత్యాలతో పాటు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత, విజయడెయిరీ తదితర స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, అన్ని శాఖల అధికారులు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి, పక్కన కలెక్టర్, డీసీపీ తదితరులు



అమరులకు నివాళులర్పిస్తున్న మంత్రి



ప్రశంస పత్రం అందజేస్తూ..



గౌరవ వందనం చేస్తున్న పోలీసులు



దశాబ్ది ఉత్సవాలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- వీసీలో సీఎస్ శాంతకుమారి

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ సీఎస్ శాంతకుమారి అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రైతు బీమా, రైతుబంధు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ శివలింగయ్య ఉన్నత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ప్రతి రోజు జరిగే కార్యక్రమాలను వీడియో, ఫొటో డాక్యుమెంటరీ చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి, సీపీఓ ఇస్మాయిల్, జెడ్పీ సీఈఓ వసంత, డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీఈఓ రాము, తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

రేపట్నుంచి ఎంసీపీఐ(యు) రాష్ట్ర ప్లీనరీ సభలు



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి హంసరెడ్డి, నాయకులు

హన్మకొండ: ఎంసీపీఐ (యు) రాష్ట్ర ప్లీనరీ సభలు వరంగల్ జిల్లా నర్సంపేటలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ప్లీనరీ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌రెడ్డి హంసరెడ్డి మాట్లాడుతూ.. నర్సంపేటలో జరిగే పార్టీ ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్లీనరీని పురస్కరించుకుని ఈ నెల 4న నర్సంపేటలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి వరంగల్ రోడ్డు వరకు భారీ ఎర్రదండు ప్రదర్శన ద్వారా బహిరంగ సభకు చేరుకోనున్నట్లు వివరించారు. 5, 6 తేదీల్లో రెండు రోజులు ప్రతినిధుల సభ ఉంటుందని చెప్పారు. ఈ ప్లీనరీ సమావేశాలకు రాష్ట్రవ్యాప్తంగా 400 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దం నాగార్జున, మాస్ సావిత్రి, నాయకులు యాకమ్మ, హిందూ కళ్యాణి, రామ్మోహన్, రాధిక, మణిమాల, సరళ, ఖాజా పాషా, సరిత, రాణి, అశ్విని, అఖిల, నందిని, వైష్ణవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ : నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి, ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సభ్యుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడకలను పురస్కరించుకుని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బతుకులు బాగుపడతాయని నమ్మిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని, తొమ్మిదేళ్ల పాలనలో దళిత ముఖ్యమంత్రి ఊసే లేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కొమ్మూరి

నేటినుంచి 'బడి బాట'

- 17వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం
- విద్యార్థుల సంఖ్య పెంపుపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి
- కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి





జనగామ రూరల్: వేసవి సెలవుల అనంతరం బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం శనివారం నుంచి 'జయశంకర్ బడి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, ఇంగ్లిష్ మీడియంలో బోధనపై ప్రజలకు వివరించి వారి పిల్లలను సర్కారు స్కూళ్లలో చేర్పించేలా చర్యలు చేపట్టింది. ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభించనున్నట్లు డీఈఓ రాము తెలిపారు.

జిల్లాలో 508 సర్కారు స్కూళ్లు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు 508 ఉన్నాయి. ఇందులో 341 ప్రాథమిక, 64 ప్రాథమికోన్నత, 103 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 35,965 మంది విద్యార్థులు ఉన్నారు.


ఆంగ్ల బోధనపై ప్రత్యేక దృష్టి

త్వరలో ప్రారంభమయ్యే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం బోధన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఆ మేరకు ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే బెంగళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయ సహకారంతో ఉపాధ్యాయుల్లో ఆంగ్లభాష నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పలు విడతల్లో ఉపాధ్యాయులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇకపై ఆంగ్లభాషలో ఆత్మవిశ్వాసంతో అనర్గళంగా మాట్లాడేలా.. సులభంగా బోధించేలా తర్ఫీదు ఇచ్చారు.

కార్యక్రమాల వివరాలు:

- 3 నుంచి 9వ తేదీ వరకు : గ్రామాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీల చొరవతో ఇంటింటి ప్రచారం, ర్యాలీలు, బ్యానర్లు, పోస్టర్లు కరపత్రాల పంపిణీ చేపట్టాలి.
- 12న 'మనఊరు–మనబడి' కార్యక్రమం నిర్వహించి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు స్వాగతం పలకాలి.
- 13న అక్షరాస్యత, అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి 'తొలిమెట్టు' కార్యక్రమంపై అవగాహన కల్పించాలి.
- 14న బాలసభ, పాఠశాల స్థాయిలో పిల్లలతో కమిటీలు, క్లబ్‌లు ఏర్పాటు చేయాలి.
- 15న బడీడు, ప్రత్యేక అవరాలు గల పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలి.
- 16న ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించాలి.
- 17న పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను పాఠశాలలకు ఆహ్వానించి ఉన్నత విద్య, భవిష్యత్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. చదువు, ఆటల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించాలి.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలో ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించే బడిబాట కార్యాక్రమాలపై ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు చేశాం. ఈ మేరకు ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తాం. బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేరేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

- కె.రాము, డీఈఓ

5 నుంచి రేషన్ డీలర్ల సమ్మె

చిల్పూరు : ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 42 రోజుల పాటు పాల్గొన్నాం.. ప్రభుత్వం ఏర్పడగానే సమస్యలు తీరుస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ నేటికీ తమను పట్టించుకోవడం లేదు.. అందుకే హక్కుల సాధనకు ఈనెల 5 నుంచి సమ్మె చేపడుతున్నట్లు రేషన్‌డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి జయపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎడ్ల మల్లయ్య తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రేషన్‌షాపుల ద్వారా వంద క్వింటాళ్లు అమ్మితే తమకు రూ.7 వేలు వస్తాయని, అందులో నుంచి హమాలీ, భవనాల అద్దె, డ్రైవర్ బత్త, కరెంటు బిల్లు, ఇతరత్రా ఖర్చులు పోతే రోజువారీ పనులు చేసే కూలీ కన్నా తమ బతుకులు భారంగా మారాయన్నారు. ప్రభుత్వం స్పందించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

భూపోరాటాలపై నిర్బంధం ఆపాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్

జనగామ రూరల్: భూపోరాటాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని తక్షణమే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యాదగిరి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 70 కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని ఉంటున్నారని, వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉండగా నిర్బంధాలతో పోరాటాలను అణచివేస్తున్నారని మండిపడ్డారు. బచ్చన్నపేట మండలం గోపాల్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకోగా అక్కడి భూకబ్జాదారులు పేదలతోపాటు సీపీఎం నాయకులపై అక్రమ కేసులు పెట్టారనీ.. అదే ఎమ్మెల్యే అనుచరుడు భూమిని ఆక్రమించుకుంటుంటే అధికారులు వదిలేశారని అన్నారు. సీపీఎం నాయకులను వెంటనే విడుదల చేసి.. అందుకు బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, జోగు ప్రకాశ్, నరేందర్, సోమన్న, నాగరాజు, యాకయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గాష్ ఆలం

ములుగు: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు మావోయిస్టులను అరెస్ట్ చేసి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ములుగు జిల్లా ఎస్పీ గాష్ ఆలం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 01వ తేదీన విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వెంకటాపురం(కె) సర్కిల్ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధం కలిగిన వ్యక్తులు పేలుడు పదార్థాలను అమర్చుతున్న క్రమంలో పట్టుకుని, పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారు. పూజారి కాంకేర్ గ్రామం, ఊసూర్ బ్లాక్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మడివి దేవ మావోయిస్టు పార్టీ ఆర్‌పీసీ కమాండర్, మడకం ఊర సీఎన్ఎం కమాండర్‌గా పని చేస్తున్నారు. వెంకటాపురం(కె) మండల కార్యదర్శి సుధాకర్ ఆదేశాల మేరకు చెలిమెల అటవీ ప్రాంతంలో పేలుడు పదార్థాలను అమర్చాలని ఆదేశించారు. దీంతో పేలుడు పదార్థాలు అమర్చుతున్న క్రమంలో పోలీసులు చాకచక్యంగా ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్ కుమార్, సీఐ శివప్రసాద్, సీఆర్‌పీఎఫ్ ఎస్సై తిరుపతి రావు, పేరూర్ ఎస్సై హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య


శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఐనవోలు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పంథిని గ్రామం చింతకుంటలో చోటు చేసుకుంది. ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి శ్రీనివాస్‌రెడ్డి(43) తనకున్న ఐదు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో సుమారు రూ.10లక్షలు అప్పు అయింది. పంటలు పండక, భూమి అమ్ముకుని అప్పు తీర్చాలనుకున్నప్పటికీ సాధ్యం కాలేదు. అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం గడ్డిమందు తాగగా.. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత, కుమార్తెలు ఆశ్రిత, హారిక ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు.



వరంగల్‌లో నృత్యం చేస్తున్న యువతులు



హనుమకొండలో..



జనగామలో..



ఆవిర్భావ సంబురం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సాధించిన పురోగతిని వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


వరంగల్‌లో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలో ప్రసంగిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత


మానుకోటలో అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


భూపాలపల్లిలో కురుమల విన్యాసాలు


భూపాలపల్లిలో అమరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


దుస్తులను పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


హనుమకొండలో అమరుల కుటుంబ సభ్యులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదాం

- పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ పూజ

మామునూరు: అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల విధి నిర్వహణ సైతం తోడ్పడాలని, సమష్టిగా రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదామని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. ఖిలా వరంగల్ మండలం పోలీస్ ట్రెనింగ్ కళాశాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పోలీసు శిక్షణ కళాశాలలో పరిపాలన భవనం వద్ద పీటీసీ ప్రిన్సిపాల్ పూజ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. బంగారు తెలంగాణ మన లక్ష్యమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ముందుకెళ్తూ.. రాష్ట్ర శాంతిభద్రత, ప్రజల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, రమేష్, భిక్షపతి, పాండు నాయక్, ఏఎల్ఐలు రాధిక, సత్యనారాయణ, ఆర్ఐలు రాజేష్, చంద్రశేఖర్, దశరథం, నవీన్, సీఎల్ఐలు నరేష్, రవీందర్, డాక్టర్ సుధీర్, ఏఓ ఫర్హానా, పీఆర్‌ఓ రామచారి, 374 శిక్షణార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్దిఖీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్దిఖీ జాతీయ జెండాను ఆవిష్కరించగా.. ఎంవీఐలు రవీందర్, వెంకన్న, ఏఎంవీఐ శాలిని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ ఇంజారపు పూజ

అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌కు ఎంపిక

కురవి: అంతర్జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు మానుకోట జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన నక్క భవాని, పెద్దవంగర మండలంలోని కొరిపల్లి హైస్కూల్ విద్యార్థి ఎడ్ల నాని 'సకురా సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాం ఆఫ్ జపాన్' అనే కార్యక్రమానికి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికకాగా.. జిల్లానుంచి ఇద్దరికి అవకాశం వచ్చినట్లు ఎస్‌సీఈఆర్‌టీ నుంచి లేఖ వచ్చింది. నవంబర్‌లో జపాన్‌లో జరగబోయే అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌కు ఎంపికకాగా, వీరు తమ అప్లికేషన్స్‌ను జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి పంపించాల్సి ఉంటుంది. భవానీ ఎంపికపై గైడ్ టీచర్ సారంగపాణి, బలపాల సర్పంచ్ ముండ్ల ప్రమీల, మండల రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్ ముండ్ల రమేష్, గ్రామస్తులు శుక్రవారం అభినందించారు.


గైడ్ టీచర్ సారంగపాణితో భవాని

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

GOLDEN OFFER

■120 Sq.Yds ప్లాట్లలో 640 Sft తో 14 పండ్ల మొక్కలు కల్గిన ఫామ్ హౌజ్, ఫర్నీచర్ అమ్మబడును. బుక్ చేసుకున్నవారికి 1 Lakh worth గోల్డ్ ఫ్రీ. సెల్: 9390111828. [WA-6972]

FLATS FOR SALE

■2 BHK Flats for Sale. Ready to Occupy. TNGO's Colony Phase-2, Near: 100Ft Road, Sree Nivasam Apartment, HNK. Loan Available. Ph: 9440232703. [W-785583]

PLOT FOR SALE

■కేవలం రూ॥ 3,00,000/–లకే 121 గజాల ప్లాటు WGL to KMM హైవే (NH-563) వర్ధన్నపేట @ ఇల్లందు 60 Fts రోడ్డు ఫేస్‌కు మా వెంచర్ యందు ప్లాట్లు అమ్మబడును. సెల్: 9390119772. [WA-6978]

■ములుగు జిల్లాలోని ఏకైక DTCP లేఅవుట్ జవహర్‌నగర్ టోల్‌గేట్ ఆనుకొని ఉన్న ప్లాట్ల కోసం సంప్రదించండి: 9154047148. [WA-6971]

■Kazipet, Diesel Colony, Back side of Prasad Hospital, West Face, 249 sq yds (28x80) with G+2 Building Permission. Direct Owner. Ph : 9912345659. [HA-3224]

SERVICES

LOANS

■సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785581]

WANTED

■Wanted Male / Female Marketing Executives On Field Work for Credit Cards Sales. Salary: 12K + Incentives. Cont: 9963490087. [WA-5360]

■హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18K. ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9963114535, 7287061111 [H-793435]

■హన్మకొండ ప్రముఖ డయాగ్నస్టిక్ సెంటర్‌లో హౌస్ కీపింగ్ వర్క్ చేయుటకు బాయ్స్ & లేడీస్ అర్జెంట్‌గా కావలెను. 9గం. డ్యూటీ, 4 W/O +ESI+PF+ మంచి జీతం. హౌస్ కీపింగ్‌లో అనుభవం గల ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కావలెను. సంప్ర: 9032153413. [H-797695]

■ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786393]

■హన్మకొండ – పరకాల స్కూల్ బస్సు నడుపుటకు డ్రైవర్స్ మరియు అటెండర్స్ కావలెను. సంప్రదించవలసిన సెల్ నెం. 8374896046. [K-1217151]

■అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 8465843194 [G-600]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/–రూ॥ అదనపు లైను 60/– రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బండరాయి తలపై పడి యువకుడి దుర్మరణం

- పూడిక తీస్తుండగా ఘటన


పృథ్వి (ఫైల్)

రాయపర్తి: వ్యవసాయ బావిలో క్రేన్ సాయంతో పూడిక మట్టి తీస్తుండగా పైనుంచి బండరాయి తలపై పడి యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొండూరు శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామానికి చెందిన రూపాని నరహరి, యశోద దంపతులు, వారి కుమారుడు రూపాని పృథ్వీరాజ్ (26) ముప్పై ఏళ్లక్రితం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి వచ్చి వ్యవసాయక్షేత్రాల్లోని బావుల్లో క్రేన్ సాయంతో పూడిక తీతమట్టి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్‌కు చెందిన నాగేశ్వర్‌రావు వ్యవసాయ భూమిలో బావిలో పూడిక మట్టి తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో ఉన్న పృథ్వీపై బండరాయి పడింది. ఈ ఘటనలో పృథ్వీ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల కోసం స్థానిక ఎస్సై బండారి రాజును వివరణకోరగా ఎలాంటి పిటీషన్ రాలేదని తెలిపారు.

ఆటోలో నుంచి జారిపడి మహిళ మృతి


మృతిచెందిన విజయ

కేసముద్రం: అజాగ్రత్తతో ఆటో నడపడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ జారి కిందపడి మృతిచెందిన సంఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వల గ్రామానికి చెందిన గంట విజయ(45) మానుకోటకు వెళ్లేందుకు ఓ ఆటోలో ఎక్కింది. ఈ క్రమంలో తాళ్లపూసపల్లి దాటాక ఆటో డ్రైవర్ యుగేందర్ అజాగ్రత్తగా ఆటో నడపడంతో ఆటోలో ప్రయాణిస్తున్న విజయ ఒక్కసారిగా జారి కింద పడింది. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

ధర్మసాగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ మండలం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధి కాజీపేట మండలం రాంపూర్ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీ కొని తలపై నుంచి వెళ్లగా తల ఛిద్రమై మృతి చెందాడు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి పోలీసులు చేరుకున్నారు. అయితే మృతుని తల ఛిద్రమై గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతుడి ఒంటిపై తెలుపురంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రాంపూర్ వీఆర్ఏ రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

బాలుడి ఆత్మహత్య


హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి సమ్మయ్యనగర్‌లో శుక్రవారం ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన కోటేశ్వరమ్మకు సమ్మయ్యనగర్‌లో కుమారులతో ఉంటూ కూలీ పనిచేసుకుంటుంది. అయితే చిన్న కుమారుడు తిరుపతి(16)కు సమాచారం ఇవ్వకుండా పెద్ద కుమారుడితో కలిసి కోటేశ్వరమ్మ గురువారం గుంటూరుకు వెళ్లింది. తనకు చెప్పకుండా వెళ్లినందుకు ఆందోళనకు గురైన తిరుపతి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

జేసీబీ ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు శ్రీధర్

కాజీపేట అర్బన్: ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీ కొట్టడంతో దర్గా కాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్(33) మృతి చెందిన ఘటన శుక్రవారం న్యూశాయంపేట జంక్షన్‌లో చోటు చేసుకుంది. సుబేదారి పోలీసులు, మృతుడి సోదరుడు పబ్బోజు శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. దర్గాకాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం శ్రీధర్ దర్గా కాజీపేట నుంచి వరంగల్‌కు హంటర్‌రోడ్డు మీదుగా తన ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. న్యూ శాయంపేట జంక్షన్‌కు చేరుకోగా ఎదురుగా వస్తు న్న జేసీబీ డ్రైవర్ పల్లెపు సందీప్ అతివేగంతో వచ్చి ఢీ కొట్టాడు. దీంతో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేర కు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దశాబ్ది ఉత్సవాల నోడల్ ఆఫీసర్‌గా హరిత


కలెక్టర్ సిక్తాతో హరిత

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల నోడల్ ఆఫీసర్‌గా విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ హరితను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె శుక్రవారం హైదరాబాద్ నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. హరితను కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, శ్రీవత్స కోట, అశ్విని తానాజీ వాకడేలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా జిల్లాల్లో సమన్వయంతో పనిచేసి దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లపై అన్నదాతల ఆగ్రహం

- కాటారం–మంథని ప్రధాన రహదారిపై బైఠాయింపు


రహదారిపై ధాన్యానికి నిప్పంటించి ఆందోళన చేస్తున్న రైతులు

కాటారం: ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదని, కేంద్రం నిర్వాహకులు అడ్డదారి తొక్కుతూ పైసలు ముట్టజెప్పినవాళ్లకే గన్నీ సంచులు ఇస్తున్నారని ఆరోపిస్తూ రేగులగూడెం అన్నదాతలు ఆగ్రహించారు. శుక్రవారం కాటారం– మంథని ప్రధాన రహదారిపై రేగులగూడెం వద్ద రోడ్డుకు అడ్డంగా ధాన్యం బస్తాలు, కర్రలు వేసి రైతులు బైఠాయించారు. ధాన్యం బస్తాలకు నిప్పంటించి నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు, రవాణాపై స్పష్టత వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడంతో రోజుల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విక్రయించిన ధాన్యాన్ని తరలించడానికి లారీల కొరత ఉందని వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చిన వారికే కేంద్రం నిర్వాహకులు గన్నీ సంచులు ఇస్తున్నారని కాంటాలు తొందరగా అయ్యేలా చూస్తున్నారని రైతులు ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణలో అధికారులు, సిబ్బంది విఫలమయ్యారని విమర్శించారు. కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నా సమాచారం అందుకున్న కాటారం ఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ జివాకర్ రెడ్డి, పీఏసీఎస్ అధికారులతో ఎస్సై ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యను వివరించారు. రైతులకు ఇబ్బందులు కల్గకుండా త్వరగా కొనుగోళ్లు సాగేలా చూస్తామని తహసీల్దార్, సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్‌సింగ్

మహబూబాబాద్ అర్బన్: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 60ఏళ్లలో చేయలేని అభివృద్ధి, పీఎం మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధ్యమైందన్నారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసిన ఘనత బీజేపీదేనని, ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకొని దేశంలో కలిపామన్నారు. కేసీఆర్ తెలంగాణకు చేసిందేమీ లేదని విమర్శించారు. మానుకోట జిల్లాలో మెడికల్ కళాశాల కోసం గిరిజనుల భూములు లాక్కున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దళిత, గిరిజనులకు 3 ఎకరాల భూమి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. తెలంగాణ కోసం బలిదానం చేసుకున్న కుటుంబాలను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో దోచుకున్న వారికే సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, 1,200 తెలంగాణ అమరవీరుల కుటుంబాల్లో ఒక్కరికి కూడా ఉద్యోగావకాశాలు కల్పించలేదని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్, ఫసల్ బీమా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లాంటి పథకాలు తెలంగాణలో అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో లక్షల కోట్ల అవినీతి జరిగిందని, బిడ్డ కవిత లిక్కర్‌స్కాంలో ఉండగా, కొడుకు కేటీఆర్ ఐటీ మంత్రిగా ఉంటూ దోచుకుంటున్నారని ఆరోపించారు. పోడుభూముల పట్టాలు అందించడంలో సీఎం విఫలయ్యారని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్, సీనియర్ నాయకులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.